క్లుప్తంగా

పశువులకు టీకాలు వేయించాలి



ఆరికరేవులలో పాడి రైతులకు మందులు అందిస్తున్న సర్పంచ్ నాగవేణి కుమారి

బిక్కవోలు: పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధుల నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని మండపేట పశు వైద్యుడు వీజీఎస్వీ ప్రసాద్ అన్నారు. గురువారం ఆరికరేవులలో రాష్ట్ర పశు సంవర్ధక శిక్షణ కేంద్రం మండపేట ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా పశువుల వివిధ వ్యాధులకు ఉచితంగా చికిత్స చేశారు. అనంతరం డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ పాడి రైతులు పశు సంరక్షణపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పశువులకు సరైన సమయంలో గర్భధారణ చేయించాలన్నారు. పాల ఉత్పత్తి పెరగడానికి తగు సూచనలు ఇచ్చారు. అనంతరం సర్పంచ్ రెడ్డి నాగవేణి కుమారి ఉచిత మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెళ్లూరు పశు వైద్యులు గొలి వీర్రాజు, కొర్ల వినాయకరావు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రెడ్డి శ్రీనివాస్, కొర్ల నాగేశ్వరరావు, మహిపాల స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ

బిక్కవోలు: ఆరికరేవుల, మెళ్లూరు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను గురువారం పంపిణీ చేశారు. మెళ్లూరు ఉన్నత పాఠశాలలో 130 విద్యార్థులకు కిట్లను సర్పంచ్ సాయిరాం, ఆరికరేవులలో సర్పంచ్ రెడ్డి నాగవేణి కుమారి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మధ్యాహ్నం భోజనం నూరు శాతం తినే విధంగా చర్యలు తీసుకోవాలని హెచ్ఎం లక్ష్మి కోరారు. అలాగే ఆరికరేవుల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు చిన్న అచ్చుతరామయ్య, ఎంపీటీసీ కొర్ల చక్రధరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు రంగంపేటలో..

రంగంపేట: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం స్టూడెంట్స్ కిట్లు పంపిణీ చేయనున్నట్టు ఎంఈఓలు కె.శ్రీనివాసరావు, పి.మధుసూదనరావు తెలిపారు. ముందుగా డిశలేరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు మండల స్థాయి ప్రజాప్రతినిధులతో స్టూడెంట్ కిట్ల పంపిణీ ప్రారంభిస్తామన్నారు.

షిరిడీసాయికి ప్రత్యేక పూజలు



పెద రాయవరంలో సాయిబాబా

రంగంపేట: పెద రాయవరంలో కొలువైన షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై బాబాను దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు మండల పరిషత్ సమావేశం

బిక్కవోలు: స్థానిక మండల పరిషత్తు సర్వసభ సమావేశం శుక్రవారం జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ వీడీ రత్నకుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు తాత్కాలిక ఎంపీపీ బుద్ధాల కన్నారావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆయన కోరారు.

కొత్తగా డయేరియా కేసులు లేవు



లంకూరులో సుబ్బారావు ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో కొత్తగా డయేరియా కేసులు నమోదు కాలేదని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఏవీకే చైతన్య గురువారం తెలిపారు. పది రోజులుగా లంకూరులో 16 డయేరియా అనుమానిత కేసులు నమోదయ్యాయని, వారిలో 14 మంది చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యారన్నారు. భేదంపూడి జగన్నాథానికి అదుపులోకి వచ్చిందని, మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా బుధవారం మృతి చెందాడన్నారు. అతడికి డయేరియా తగ్గిందని, డయాబెటిస్ ఉండటంతో వేరే ఆరోగ్య సమస్యలు తలెత్తాయన్నారు. మరో బాధితుడు పెంటా సుబ్బారావును వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల 33/11 కేవీ లైన్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. గాడాల, నిడిగట్ల, మధురపూడి, పాలచర్ల గ్రామాలలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా ఉండదన్నారు.

ఒక్కరికే వందనం

- తల్లికి వందనం పథకానికి మెలిక
- ఒక్క విద్యార్థికే ఇస్తామంటూ జీవో
- మాట మార్చిన కూటమి ప్రభుత్వం



రాజానగరంలోని ప్రభుత్వ పాఠశాల

రాజానగరం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించారు. దానిలో తల్లికి వందనం ఒకటి. మాజీ ముఖ్యమంత్రి జగన్ అమలు చేసిన అమ్మ ఒడి పథకానికి పేరు మార్చి దీన్ని ప్రవేశ పెట్టారు. ఎంత మంది పిల్లలు చదువుకుంటే అంత మందికీ ఏడాదికి రూ.15 వేల చొప్పున అందజేస్తామని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ఎన్నికలలో విజయం సాధించి అధికారం చేపట్టిన తర్వాత మాట మార్చారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం బుధవారం జీఓ నెంబరు 29 జారీ చేసింది. దానిలో ఈ పథకం కింద ఒక్కో తల్లికి రూ.15 వేలు మాత్రమే చొప్పున ఇవ్వనున్నట్టు తెలిపారు. గతంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఇస్తామని చెప్పి, ఇప్పుడు కేవలం ఒకరికే అని జీవో జారీ చేయడంపై విద్యార్థుల తల్లులు ఆందోళన చెందుతున్నారు.

ఏం చేయాలో..

ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ చదువుకునే పిల్లలకు 'తల్లికి వందనం' పథకం పేరుతో ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున వారి తల్లుల బ్యాంకు అకౌంట్లలో జమ చేయాలి. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, వారి అభ్యర్థులు ఎన్నికల సమయంలో ఊకదంపుడు ప్రచారాలతో హోరెత్తించారు. ఆ హామీలను నమ్మి ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు ఇప్పుడు ఏం చేయాలో తెలియడం లేదు. కూటమి ప్రభుత్వం మాటమార్చడంపై ఆందోళన చెందుతున్నారు.

జగన్ హయాంలో..

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అమ్మ ఒడి పథకం సక్రమంగా అమలు జరిగింది. ఏటా రూ.15 వేలు చొప్పున నిధులు తల్లుల బ్యాంకు ఖాతాలలో జమ అయ్యాయి. ఇచ్చిన హామీ మేరకు నిబంధనలను అనుసరించి అర్హులందరికీ పథకాన్ని వర్తింజేశారు. రాజానగరంలో నియోజకవర్గంలో గడిచిన ఐదేళ్లలో 61,449 మంది పిల్లలకు సంబంధించి వారి తల్లల ఖాతాలకు 142.91 కోట్లు జమచేశారు.

హామీ అమలు చేయాలి

చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇద్దరు పిల్లలున్నా, ముగ్గురు పిల్లలున్నా పథకాన్ని వర్తింపచేయాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు. గత జగన్ ప్రభుత్వం జూన్‌లోనే అమ్మఒడి పథకాన్ని అమలు చేసేదన్నారు. గతేడాది జూన్ 28న తల్లుల ఖాతాల్లో సొమ్ములు జమయ్యాయని, కానీ కూటమి ప్రభుత్వం పాఠశాలలు తెరిచి నెల కావస్తున్నా నిర్లక్ష్యం వహిస్తోందన్నారు.

తల్లికి వందనం ఇంకెప్పుడు?

పెదపూడి: అనపర్తి నియోజకవర్గంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాలుగు సార్లు అమ్మ ఒడి పథకం అమలు చేశారు. ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలోనే తల్లుల ఖాతాలకు నగదు జమ చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాలుగు సార్లు విద్యార్థులకు చేకూరిన లబ్ధిని పరిశీలిస్తే.. అనపర్తి మండలంలో 21,947 మందికి రూ.32,92,05,000, పెదపూడి మండలంలో 23,235 మందికి రూ.32,27,52,000, రంగంపేట మండలంలో 24,327 మందికి రూ.33,39,76,000, బిక్కవోలు మండలంలో 20,109 మందికి రూ.27,73,84,000 లబ్ధి చేకూరింది. ప్రస్తుతం నియోజకవర్గంలో తల్లికి వందనం పథకం కోసం తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో ఒకటి నుంచి ఇంటర్మీడియట్ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీల్లో చదివే పిల్లలు సుమారు 30 వేలకు పైబడి ఉంటారనేది ఒక అంచనా. వీరందరికి ఎన్డీయే ప్రభుత్వం తల్లికి వందనం పథకం అందించాల్సి ఉంది. ఇప్పటికే ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థులను ఫీజు చెల్లించాలంటూ అడుగుతున్నారంటూ తలిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హామీ నిలబెట్టుకోవాలి

తల్లికి వందనం పథకంపై కూటమి నాయకులు ఎన్నికల సమయంలో చాలా విస్తృతంగా ప్రచారం చేశారు. ఎంత మంది పిల్లలున్నా పథకాన్ని వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. కానీ నేడు మాట మార్చుతున్నారు. పాఠశాలలు తెరిచి దాదాపు 30 రోజులు కావస్తున్నా ఇంకా తల్లికి వందనంపై స్పష్టత లేదు. ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి.

– సబ్బారపు సుశీలరావు, పేరెంట్, తుంగపాడు

న్యాయమేనా..

ఇంటిలో ఒకటి నుంచి 12వ తరగతి వరకూ ఎంత మంది పిల్లలు చదువుకుంటున్నా వారందరికీ ఒక్కొక్కరికీ రూ.15 వేలు ఇస్తామని కూటమి నాయకులు చెప్పారు. తల్లికి వందనం పథకంపై బాగా ప్రచారం కూడా చేశారు. ఆ మాటలు నిజమని నమ్మాం. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఇంటికి ఒక్కరికే అంటే ఎలా. ఎన్నికల హామీలను విస్మరించడం న్యాయమేనా.

– వొనుం ప్రభావతి, పేరెంట్, రామేశంపేట

అందరికీ ఇవ్వాలి



తల్లికి వందనం పథకంపై ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ విస్తృతంగా ప్రచారం చేశారు. ఇప్పుడు విడుదల చేసిన జీవోలో మెలిక పెట్టారు. చదువుకుంటున్న పిల్లలందరికీ పథకాన్ని వర్తింపజేయాలి. నాకు ఇద్దరు పిల్లలు. ఒకరు కాలేజీ, మరొకరు హైస్కూల్లో చదువుతున్నారు.

– మద్దాల రాణి, బుచ్చెంపేట

ట్రిపుల్ ఐటీకి ముగ్గురి ఎంపిక



రెడ్డి వెన్నలసాయి, పి.సాయి రామతులసి, ఎస్.మల్లేశ్వరి

పెదపూడి: సంపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తుత్తమ ఉత్తీర్ణత సాధించిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ఆ పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. విద్యార్థులు రెడ్డి వెన్నలసాయి, పి.సాయి రామతులసి, ఎస్.మల్లేశ్వరి ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారన్నారు. వారిని ప్రధానోద్యాయుడు త్రిమూర్తులు, గ్రామ సర్పంచ్ అద్దంకి మాచరమ్మ తదితరులు అభినందించారు.

భోజనం ప్యాకెట్ల వితరణ



భోజనం అందజేస్తున్న సేవాసమితి సభ్యుడు

సీతానగరం: చినకొండేపూడిలోని షిర్డీ సాయిబాబా వసతి మందిరం ఆధ్వర్యంలో గురువారం నిరుపేదలకు భోజనం వితరణ చేశారు. బుర్రిలంకకు చెందిన తడాల ఏడుకొండలు అందించిన ఆర్థిక సాయంతో 150 మందికి భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు.

నామినేషన్ దాఖలు

రాజానగరం: రాజమహేంద్రవరంలోని ది ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు పాలకవర్గానికి జరగబోయే ఎన్నికలలో డైరెక్టర్ పదవికి దివాన్ చెరువుకు చెందిన గంగిశెట్టి సోమేశ్వరరావు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఆ బ్యాంకుకు దివాన్ చెరువులో ఒక బ్రాంచ్ ఉంది.

స్వామి కల్యాణం.. వైభోగం



కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



వీరభద్రేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బిక్కవోలు: స్థానిక శ్రీగోలింగేశ్వరస్వామి ఆలయంలో కొలువైన భద్రకాళీ సమేత వీర భద్రేశ్వరస్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. బుధవారం రాత్రి ఆషాఢ శుద్ధ పంచమి సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు కల్యాణం నిర్వహించి స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వేడుకలను తిలకించారు. బిక్కవోలులోని కుమార సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో స్వామివారిని గురువారం ప్రత్యేకంగా అలంకరించారు. స్కంద షష్ఠి సందర్భంగా అభిషేకాలు చేశారు. ఉదయం నుంచీ భక్తుల రద్దీ నెలకొంది.

బాలిక అదృశ్యం

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరానికి చెందిన బాలిక కనిపించడం లేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. గురువారం తెల్లవారుజామున గమనించగా తన కుమార్తె కనిపించలేదని, బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా కనిపించలేదన్నారు.

అధికారుల అదుపులో భారీ వాహనాలు

మధురపూడి: బిల్లులు లేకుండా క్వారీ మెటల్‌ను తరలిస్తున్న తొమ్మిది భారీ వాహనాలను అధికారులు అదుపులోకి తీసుకుని, కోరుకొండ తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. గోకవరం వైపు నుంచి రాజమమహేంద్రవరం వైపు వెళుతున్న వీటిని గురువారం సాయంత్రం బూరుగుపూడి జంక్షన్‌లో పట్టుకున్నారు. వీటికి సంబంధించిన అనుమతులను మైనింగ్ అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది. దాని ఆధారంగా కేసు నమోదు చేస్తామని తహసీల్దార్ రాజ్యలక్ష్మి తెలిపారు.

మనుషుల అక్రమ రవాణాను అరికడదాం



కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సిబ్బంది, ప్రజ్వల సంస్థ ప్రతినిధులు

రాజానగరం: మనుషుల అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ టి.నాగమణి అన్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మనుషుల అక్రమ రవాణాపై గురువారం స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అక్రమ రవాణాకు గురయ్యే వారిలో అత్యధికులు అమ్మాయిలేనన్నారు. ఉద్యోగం, సినిమా అవకాశాలు తదితర వాటిని ఎరగా చూపి అమ్మాయిలను విదేశాలకు విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మహిళలు చైతన్యవంతులు కావాలన్నారు. సంస్థ కో ఆర్డినేటర్ శ్రావ్య శృతి మాట్లాడుతూ డాక్టర్ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో మనుషుల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా తమ సంస్థ 28 ఏళ్లుగా పోరాటం చేస్తోందన్నారు. ఐసీడీఎస్, పోలీస్, విద్య న్యాయ శాఖల సహకారంతో ఇప్పటి వరకు 28,200 మంది మహిళలను కాపాడి, వారికి పునరావాసం కల్పించామన్నారు. ప్రతి గ్రామంలో కమ్యూనిటీ విజిలెంట్ గ్రూపులను ఏర్పాటు చేయడం ద్వారా అందరు అప్రమత్తంగా ఉంటారన్నారు. ఇలాంటి సంఘటనలపై 1930 అనే టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం మనుషుల అక్రమ రవాణాపై లఘు చిత్రాల ద్వారా అవగాహన కలిగించారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం



లంకూరులో అవగాహన కల్పిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

సీతానగరం: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య ఆధ్వర్యంలో మండలంలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. లంకూరులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబమన్నారు. జనాభా విపరీతంగా పెరగడం వల్ల అనేక అనర్థాలు కలుగుతాయన్నారు. దంపతులు తాత్కాలిక, శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు, సూపర్‌వైజర్ కె.సుధాకర్, హెల్త్ అసిస్టెంట్ నందీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జనాభా ఎక్కువైతే అనర్థాలు

రాజానగరం: జనాభా విపరీతంగా పెరిగితే అనేక అనర్థాలు కలుగుతాయని ఆదికవి నన్నయ యూనివర్సిటీ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్బారావు అన్నారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఆర్థిక శాఖ విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ పి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అధిక జనాభా వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ గోపాలకృష్ణ, డాక్టర్ పి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి



రామవరంలో స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పెదపూడి: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి మండలం రామవరంలో నల్లమిల్లి మూలారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు ఆయన స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్టూడెంట్ కిట్‌లో టెస్ట్, నోట్‌బుక్స్, డిక్షనరీ, బ్యాగ్, బెల్టులు, బూట్లు, సాక్స్ తదితరాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనపర్తి ఎంఈఓ-1, 2 పుష్పలత, సత్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత



కళాశాల ఆవరణను శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, తెలుగు అధ్యాపకురాలు ఎం.సుధామయి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గురువారం పరిసరాల పరిశుభ్రత అనే కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా కళాశాల ప్రాంగణంలో పిచ్చి మొక్కలు, తుప్పలను తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో 25 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు. వారందరినీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ప్రశంసించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హరేరామకృష్ణ, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ మాధవ్, సుబ్బారావు, అలేఖ్య, మీనాక్షి పాల్గొన్నారు.

నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న రైల్వే ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ రాజమహేంద్రవరం శాఖ ఓపెన్ లైన్స్, మెకానికల్ బ్రాంచి సెక్రటరీలు ఎస్ఎస్ చంద్రమౌళి, వి.త్రినాథ్ డిమాండ్ చేశారు. ఎన్ఎఫ్ఐఆర్ జనరల్ సెక్రటరీ మర్రి రాఘవయ్య, సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ డివిజనల్ సెక్రటరీ ఆమంచి వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు గురువారం రైల్వే స్టేషన్ ఆవరణలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో పలువురు రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతులకు సహకారం అందించండి

మధురపూడి: రైతులకు పూర్తి సహకారం అందించాలని ఎరువులు, పురుగుమందు డీలర్లను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కోరారు. కోరుకొండ మండలం కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం పురుగుమందుల డీలర్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ రంగం అభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వ్యవసాయశాఖ జిల్లా అధికారి మాధవరావు మాట్లాడుతూ రైతులకు డీలర్లు సహకారిగా ఉండాలని కోరారు. వ్యవసాయశాఖ ఏడీ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా ఆర్యాపురం బ్యాంక్ నామినేషన్లు

రాజమహేంద్రవరం సిటీ: ది ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ పాలక వర్గ ఎన్నికలకు గురువారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 20వ తేదీన జరగనున్న ఎన్నికలకు పలువురు తమ నామినేషన్లను ఎన్నికల అధికారి కృష్ణకాంత్‌కు అందజేశారు. వైఎస్సార్ సీపీ బలపరిచిన బ్యాంక్ పాలకవర్గ చైర్మన్ అభ్యర్థిగా నందెపు శ్రీనివాస్, ఇతర డైరెక్టర్ల పదవులకు సభ్యులతో కలసి నామినేషన్ పత్రాలను అందజేశారు. నందెపు శ్రీనివాస్, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ గతంలో పాలకవర్గంగా పనిచేసిన చల్లా శంకర్రావు ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంకును భ్రష్టు పట్టించారని, అన్ని విధాలుగా అవినీతి మయం చేశారన్నారు. తమ ప్యానల్‌ను గెలిపించడం ద్వారా ఆర్యాపురం బ్యాంకు ప్రతిష్ఠను కాపాడేందుకు ఖాతాదారులు సహకరించాలని కోరారు. ఈ నెల 20వ తేదీన ఎస్‌కేవీటీ స్కూల్లో జరిగే ఎన్నికల్లో ఖాతాదారులందరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారురు. డైరెక్టర్లుగా పులవర్తి లక్ష్మణస్వామి, దూడల త్రినాథ్, నందూరి సుబ్బారావు, డాక్టర్ లంక సత్యనారాయణ, నందం కుమార్ రాజా, కస్సే రాజేష్, ఆకుల శ్రీనివాస్ ఉన్నారు. సీపీఐ నుంచి కూండ్రపు రాంబాబు, కాంగ్రెస్ నుంచి కొవ్వూరి శ్రీనివాస్‌కు అవకాశం కల్పించారు. కార్యక్రమంలో జాంపేట బ్యాంకు చైర్మన్ బొమ్మన జయకుమార్, వాకచర్ల కృష్ణ, మజ్జి అప్పారావు, వడ్డి మురళీ, మజ్జి సూకతర్నం, ఒంటెద్దు సూరిబాబు తదితరులు ఉన్నారు.

కూటమి నాయకుల నామినేషన్

ఎన్డీఏ కూటమి బలపర్చిన చైర్మన్ అభ్యర్థి చల్లా శంకరరావు, తన బెల్ట్ 12 మంది సభ్యులతో నామినేషన్లు దాఖలు చేశారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీను, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు మాట్లాడుతూ ఆర్యాపురం బ్యాంకు ఖాతాదారుల ప్రయోజనాలు, ఆస్తుల పరిరక్షణకు కృషి చేసిన చల్లా శంకరరావును చైర్మన్‌గా గెలిపించాలని కోరారు. చైర్మన్ అభ్యర్థిగా చల్లా శంకరరావు, డైరెక్టర్లుగా బుడ్డిగ రవి, పెద్దకాపు, వై.రంగబాబు, పిల్లి శ్యామ్‌కుమార్, పోలాకి పరమేష్, యర్రమోతు ధర్మరాజు, యాళ్ల వెంకట్రావు, పడాల శ్రీనివాస్, కప్పల ప్రకాష్, నీలపాల సూర్య సత్యనారాయణ, సింగంపల్లి వెంకట రామకృష్ణ నామినేషన్లు దాఖలు చేశారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



కోరుకొండ హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీవైఈఓ నారాయణ

మధురపూడి: కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీవైఈఓ నారాయణ గురువారం పరిశీలించారు. మధ్యాహ్నం భోజన పథకం, తరగతి గదులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముందుగా కాపవరంలోని మండల విద్యా శాఖాధికారి కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అక్కడి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓలు కుశలవదొర, సుజాత ఉన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు పీటీఎస్ఎఫ్ కృషి

రాజమహేంద్రవరం సిటీ: అందరూ చదవాలి.. అందరూ ఎదగాలి అనే ధ్యేయంతో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పేరెంట్స్ టీచర్స్ అండ్ స్టూడెంట్స్ యునైటెడ్ ఫెడరేషన్ (పీటీఎస్ఎఫ్) కృషి చేస్తుందని ఆ సంస్థ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కొల్లపు వేణు (రాజా) తెలిపారు. కంబాల చెరువు హైటెక్ బస్టాండ్ ఎదురుగా ఉన్న శ్యామలా బిల్డింగ్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అట్టడుగు వర్గాలకు విద్య అందితేనే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయన్నారు. పేరెంట్స్, టీచర్స్, విద్యార్థులలో ఎవరికి ఏ సమస్య వచ్చినా తాము అందుబాటులో ఉండి పరిష్కారిస్తామన్నారు. ఈ సందర్భంగా బ్రోచర్‌ను ఆవిష్కరించారు. బద్దే జార్జి ఆంటోనీ, నక్కా వెంకటరత్నం రాజు పాల్గొన్నారు.